
సాక్షి పల్నాడు

ఆదివారం ౹ 6 ౹ ఏప్రిల్ ౹ 2025



నేడు అక్కాయకుంట తిరునాళ్ల

నాదెండ్ల: ఎండుగుంపాలెంలో కొలువైయున్న అక్కాయకుంట సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరగనుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 517.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 3,031 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా వసంత నవరాత్రులు

తెనాలిటౌన్: శరణాగతి గోష్టి పీఠం ట్రస్ట్ నరేంద్ర రామానుజ దాస స్వామీజీ ఆధ్వర్యంలో వసంత నవరాత్రుల ఉత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

రేపు చిలకలూరిపేటలో 'పీజీఆర్ఎస్'

నరసరావుపేట: వచ్చే సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను చిలకలూరిపేట పట్టణంలో నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఉదయం 10గంటలకు పీజీఆర్ఎస్ ప్రారంభమవుతుందన్నారు. ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నియోజకవర్గాల స్థాయిలో కార్యక్రమం నిర్వహించదలిచామన్నారు. అందులో భాగంగా తొలిసారిగా చిలకలూరిపేట నియోజకవర్గాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ అవకాశాన్ని నియోజక ప్రజలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులతో కలిసి చిలకలూరిపేటలో ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని, అదే సమయంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సైతం ఫిర్యాదులు స్వీకరించేందుకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 10న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ శనివారం తెలిపారు. అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, బ్యాంక్, రెవెన్యూ, మోటారు వాహన ప్రమాద, చెక్కు బౌన్స్, భరణం, కుటుంబ తగాదాలు, ముందస్తు వ్యాజ్యపు కేసులు పరిష్కారం అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకొని తమ సమయం, డబ్బును ఆదా చేసుకోవాలన్నారు.

హంస వాహనంపై శ్రీలక్ష్మీ నరసింహస్వామి



నగరంపాలెం: గుంటూరులోని ఆర్.అగ్రహారం శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం స్వామికి హంస వాహనంపై పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమాలను ఈఓ ఎస్.అంజనేయాచార్యులు పర్యవేక్షించారు.

రేపు పోలీసు పాత వాహనాల విడిభాగాల వేలం

నరసరావుపేట: పల్నాడు పోలీసు కార్యాలయంలో పోలీసు వాహనాలకు సంబంధించి వాడి తీసివేసిన సామగ్రిని ఈనెల ఏడవతేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు ఎస్పీ కార్యాలయంలోని మోటారు వాహన కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

8 నుంచి చైత్రమాస బ్రహ్మోత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి చైత్రమాస బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 8వ తేదీ మంగళవారం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 8వ తేదీ వెండి పల్లకిపై, 9న వెండి రథోత్సవం, 10న రావణ వాహనంపై, 11న నంది వాహనంపై, 12న సింహ వాహనంపై, 13 సాయంత్రం కృష్ణానదిలో నదీ విహారం ఉంటుంది. ఉత్సవాల్లో తొలిరోజు ప్రత్యేక పూజలు చేస్తారు. 11వ తేదీ రాత్రి 7 గంటలకు మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద రాయబార ఉత్సవం(ఎదుర్కోలు ఉత్సవం) జరుగుతుంది. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు ఆది దంపతుల దివ్య కల్యాణోత్సవం చేస్తారు. 12వ తేదీ సదస్యం, వేదస్వస్తి, వేదాశీస్సుల కార్యక్రమాన్ని మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తారు. 13వ తేదీ ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ధాన్యకోట్నోత్సవం, వసంతోత్సవం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. 14వ తేదీ ద్వాదశ ప్రదక్షిణలు, 15, 16 తేదీల్లో పవళింపు సేవలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

మా ఊరి దేవుడు.. అందాల రాముడు

- నేడు శ్రీరామ నవమి పర్వదినం
- జిల్లాలో కల్యాణోత్సవాలకు ఆలయాలు ముస్తాబు
- గ్రామాలు, పట్టణాల్లో పండుగ శోభ

శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండీ



సత్తెనపల్లి గడియార స్తంభం సెంటర్‌లో చలువ పందిరి ఏర్పాట్లు

సత్తెనపల్లి: సకల సద్గుణాలకు మారు రూపుగా.. మానవాళికి ఆదర్శంగా..అపురూపమైన బంధాలకు ఆలవాలంగా నిలిచిన శ్రీరాముడు జన్మించిన శుభ దినం.. ఆయన సీతారాముడు అయ్యే శుభలగ్నం వెరసి ఆదివారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా అంతటా రామాలయాలు పండుగ శోభతో కళకళలాడుతున్నాయి. సీతారాముల కల్యాణ వేళ రానే వచ్చింది. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సవాల నిర్వహణలో సందడి కనిపిస్తోంది. సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి సమ్మేళన ప్రతీకను చూడగానే కుటుంబ బాంధవ్యాలు కళ్ల ముందు ఆవిష్కృతమవుతాయి. భార్యాభర్తల అన్యోన్యత, అన్నదమ్ముల ఆప్యాయత ఆదర్శ మూర్తిపై విధేయత .. ఇలా కుటుంబంలోని అనేక కోణాలు మానవ జీవిత పరమార్థాన్ని తెలియజేస్తాయి. పుణ్య దంపతులకు ప్రతీకగా కొలిచే సీతారాముల వారి కల్యాణం కనువిందుగా నిర్వహించడం ఆచారంగా వస్తుంది. కేవలం రామాలయాలు కాకుండా దాదాపు అన్ని వైష్ణవాలయాల్లో కూడా ఈ వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహకులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక వేదికలు సిద్ధం

వేసవిలో వచ్చే శ్రీరామనవమి వేడుకలకు ప్రత్యేకత ఉంది. సీతారాముల కల్యాణం పేరిట ఓ శుభకార్యాన్ని బంధుమిత్రులు, ఇరుగుపొరుగులతో కలిసి రెండు గంటలపాటు ఒకే చోట కలిసి ఉండే అపురూపమైన ఈ అవకాశం శ్రీరామనవమి ఇస్తోంది. జిల్లాలో చిన్న, పెద్ద రామాలయాలు, వైష్ణవాలయాలు అన్నిటిల్లోనూ ఉదయం 9 నుంచి 12:30 గంటల లోపు కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఆయా ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక వేదికలను సిద్ధం చేశారు. ఆలయాల్లో కల్యాణం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులందరికీ కల్యాణ విందు ఏర్పాటు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



సత్తెనపల్లి వడ్డవల్లిలోని శ్రీరామాలయం, వేంకటేశ్వర స్వామి దేవాలయం

క్షేత్రస్థాయిలో ఐక్యతకు ప్రతీక

ఉత్సవాలు నిర్వహణ తరతరాలుగా గ్రామాల ప్రజానీకం మధ్య ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. ఆలయాలకు సమీపంలోని గ్రామస్తులంతా కులాలకతీతంగా ఉత్సవ నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసుకొని సమన్వయంతో కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు. ఆధ్యాత్మిక గీతాలాపన, భజన, ఏకాహ కళాకారులంతా ఉత్సవ చలువ పందిళ్లలో తమ కళను ప్రదర్శిస్తుంటారు. బెల్లం పానకం, వడపప్పును ప్రసాదంగా పంచుతూ తోటి వారితో ఆప్యాయంగా వ్యవహరిస్తారు.



పానకం.. ప్రీతికరం

శ్రీరాముని ఇష్టమైన బెల్లం పానకం, వడపప్పును నైవేద్యంగా సమర్పిస్తారు. నైవేద్యమనే ఆధ్యాత్మిక అంశంతో పాటు వాటిలో మిళితమైన పదార్థాలు ఆయుర్వేద గుణాలు ఉండడంతో ఆరోగ్యాన్నిస్తాయి. వేసవి ఆరంభ కాలంలో వచ్చే శ్రీరామనవమి ఉత్సవంలో ప్రసాదంగా బెల్లం పానకం, వడపప్పును భక్తులకు ప్రసాదంగా అంద జేస్తారు. బెల్లం, మిరియాలు, యాలకులతో తయారు చేసిన పానకంలో ఐరన్ యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా లభిస్తాయి. సీజన్‌లో వచ్చే గొంతు సంబంధిత సమస్యలకు ఇది ఔషధంగా పనిచేస్తుంది. పెసరపప్పు శరీర వేడిని తగ్గించి చలువ చేస్తుంది. హిందూ వివాహ వేడుకల్లో ఎదిరింపు సన్నాహాల నేపథ్యంలో పానకాల కావిడితో వియ్యాల వారికి స్వాగతం పలకడమనే ఆనవాయితీ శ్రీరామనవమి వేడుకల నుంచే వచ్చిందని అర్చకులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే శనివారం అడపా దడపా వర్షం కారణంగా అక్కడక్కడ కాస్త ఇబ్బంది నెలకొన్నప్పటికీ ఉత్సవాలు కొనసాగించనున్నారు.



బాబూజీకి ఘననివాళి



నరసరావుపేట: పల్నాడురోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాలకు ఎదురుగా ఉన్న దేశ మాజీ ఉపప్రధాని, సమతావాది డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జయంతిని పురస్కరించుకొని ఏపీ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీఆర్వో ఏకా మురళి, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు వనమా సాంబశివరావు పాల్గొన్నారు.

మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్

నరసరావుపేట: అణగారిన వర్గాల అభ్యున్నతికి, పీడిత, తాడిత ప్రజల ఆశాజ్యోతిగా మెలిగిన డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ మహనీయుడని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కొనియాడారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, అదనపు ఏఆర్ ఎస్పీ వి.సత్తిబాబు, ఎస్పీ సీఐలు ఘన నివాళులర్పించారు.



కప్పం కట్టలేదని ఫ్యాక్టరీలు మూసివేయించారు

- గురజాల టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని దుశ్చర్యతో రోడ్డున పడిన కార్మిక కుటుంబాలు
- ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని చర్చలు జరపాలి
- భవ్య, చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీల మూతపై గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: తనకు కప్పం కట్టలేదనే దురుద్దేశంతో గురజాల టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెట్టినాడ్, భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలను మూసివేయించాడని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. టీడీపీ ఎమ్మెల్యేకి ముడుపులు చెల్లించలేదని ఫ్యాక్టరీలను మూసివేయటం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు జరగలేదని, యరపతినేని చేస్తున్న దుశ్చర్యలతో వేలాది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తంగెడలోని భవ్య సిమెంట్స్ గత రెండు నెలలుగా, పెదగార్లపాడులోని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ గత 20 రోజులుగా మూతపడటం, ట్రాన్స్‌పోర్ట్ పూర్తిగా నిలిచిపోవటంపై శనివారం ఆయన మాట్లాడారు. చెట్టినాడ్, భవ్య సిమెంట్ ఫ్యాక్టరీలు మూతపడటంపై తాను ఆరా తీశానని, వ్యాపారంలో నష్టాలు రావటం ద్వారా ఫ్యాక్టరీలను మూసివేశారా అనే కోణంలో ప్రభుత్వ అధికారులు, కార్మికులను ఆరాతీస్తే టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకి కప్పం కట్టలేదని ఫ్యాక్టరీలు మూసివేయించారని తనతో చెప్పారని మాజీ ఎమ్మెల్యే కాసు పేర్కొన్నారు.

బస్తాకు రూ.5 నుంచి 20 కప్పం

రెండు ఫ్యాక్టరీలు మూతపడటం వల్ల వేలాదిమంది కార్మికులు కష్టాలు పడుతున్నారని, ఫ్యాక్టరీలను మూసివేయించటం ఎంత వరకు న్యాయమో ఆలోచన చేయాలని ఆయన కోరారు. బస్తాకి రూ.5 నుంచి రూ.20 కప్పం కట్టాలని సిమెంట్ కంపెనీలకు అల్టిమేటం ఇవ్వడం చరిత్రలో లేదన్నారు. వర్తమానంలో కూడా ఈ సంస్కృతి రాకూడదన్నారు. ఈ రోజు సిమెంట్ ఫ్యాక్టరీలను బెదిరించారని, రేపు సున్నంతో పాటుగా ఇతర వ్యాపారాలు చేసుకునే వ్యాపారులను బెదిరించి కప్పం కట్టమని డిమాండ్ చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ విష సంస్కృతిని కూకటి వేళ్లతో తీసేయాలని, దీనికి ప్రభుత్వంలోని సీఎం నుంచి సీఎస్, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కంకణం కట్టుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాసు చెప్పారు. ఫ్యాక్టరీల యజమానులతో తక్షణమే చర్చలు జరిపి యథావిధిగా కార్యకలాపాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ తరపున తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

మైనార్టీ మహిళలపై పోలీసుల వేధింపులు

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లా పెదతురకపాలెం గ్రామానికి చెందిన మైనార్టీ మహిళలను కేసుల పేరుతో రూరల్ పోలీసులు వేధిస్తున్నారు. గ్రామంలోని టీడీపీకి చెందిన మహిళ ఫిర్యాదు చేసిందనే సాకుతో పోలీసులు ఈ తంతును 20 రోజులుగా కొనసాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా పోలీసులు ఈ వేధింపులకు పాల్పడుతున్నారు. ప్రతి రోజు స్టేషన్‌కు పిలిపించి కుర్చో బెట్టడం అర్ధరాత్రి ఇంటికి పంపి ఉదయాన్నే రమ్మని చెప్పడం పోలీసులకు పరిపాటి మారింది.

టీడీపీకి చెందిన ఓ మహిళ ఫిర్యాదుతో...

ఇరుగు పొరుగుకు చెందిన మహిళల మధ్య జరిగిన చిన్న వాగ్వివాదం నేపథ్యంలో టీడీపీకి చెందిన ఓ మహిళ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పాటు గ్రామానికి చెందిన పలువురి వలన తనకు ప్రాణహాని ఉందని తెలిపింది. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వేధింపులు ప్రారంభించారని వినికిడి. 20రోజుల క్రితం కూడా సదరు మహిళ ఇదేవిధంగా ఫిర్యాదు చేయడంతో పురుషులతో మహిళలను స్టేషన్‌కు పిలిపించారు. అప్పట్లో వారం రోజులు స్టేషన్ చుట్టూ తిప్పిన అనంతరం బైండోవర్ చేసి పంపారు. మరోసారి శుక్రవారం మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో మహిళలను స్టేషన్‌కు రమ్మని చెప్పారు. రెండు రోజుల నుంచి మహిళలు స్టేషన్‌లో తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్టేషన్‌లో మహిళలకు మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను వేధింపులకు గురిచేయడంలో టీడీపీకి చెందిన మండల నాయకుడి పాత్ర ఉన్నట్టు తెలుస్తుంది. రూరల్ పోలీసుల చర్యలపై గ్రామానికి చెందిన మహిళలు శనివారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు.
- ఈ విషయమై ఎస్‌ఐ కిశోర్‌ను వివరణ కోరగా.. మహిళల మధ్య గొడవ కారణంతో ఫిర్యాదు రావడంతో స్టేషన్‌కు పిలిపించి బైండోవర్ చేసి పంపామని తెలిపారు.

కంది రైతులకు సౌభాగ్యం

- మంచి దిగుబడులు ఇస్తున్న సౌభాగ్యం రకం కంది విత్తనం
- నూతన వంగడాన్ని రూపొందించిన లాం ఫాం శాస్త్రవేత్తలు
- ఇప్పటికే సాగుచేసి అధిక దిగుబడులు సాధించిన రైతులు
- తెగుళ్లను పూర్తిస్థాయిలో తట్టుకునే రకంగా ప్రసిద్ధి



కారెంపూడిలో సౌభాగ్య రకం కంది పంటను క్షేత్ర పరిశీలన చేస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

కారెంపూడి: గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (లాంఫాం) శాస్త్రవేత్తలు రూపొందించిన నూతన కంది రకం ఎల్‌ఆర్‌జీ 133–33 సౌభాగ్య మంచి దిగుబడుల నిస్తోంది. గత ఖరీఫ్ సీజన్‌లో శాస్త్రవేత్తలు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ మోహన్‌రెడ్డి, డాక్టర్ కేవి శివారెడ్డిలు ప్రతి మండలాన్ని దర్శించి సౌభాగ్య నూతన కంది విత్తనాలను ఇచ్చి సాగు చేయాలని రైతులను ప్రోత్సహించారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని చర్లగుడిపాడు, కారెంపూడి, దొనకొండ మండలాల్లో 43 మంది రైతులకు ప్రథమశ్రేణి విత్తన కిట్‌లను పంపిణీ చేశారు. ఆ విత్తనాన్ని నీటి పారుదల కింద సాగు చేసిన రైతులకు పది నుంచి గరిష్ఠంగా 17 క్వింటాళ్ల దాకా దిగుబడులు వచ్చాయి. రైతులు చాలా కాలం తర్వాత ప్రైవేటు కంపెనీలకు దీటైన విత్తన దిగుబడులు సౌభాగ్య ద్వారా సాధించారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ విత్తనం రూపకల్పన పూర్వాపరాలపై కథనం.

దక్షిణ భారతానికి అనువైన రకం

ఈ రకాన్ని అప్పటి లాంఫాం అపరాల శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.రాజమణి, డాక్టర్ ఎంవీ రమణ, డాక్టర్ ఎం.శ్రీకాంత్‌లు 2020లో రూపొందించారు. ఈ విత్తనాన్ని క్షేత్ర పరిశీలన చేసిన కాన్పూర్‌లోని జాతీయ కంది పరిశోధనా స్థానం ఈ రకం విత్తనం దక్షిణ భారత దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సాగుకు అనువైనదిగా గుర్తించింది. ఆ తర్వాత నుంచి మన లాంఫాం శాస్త్రవేత్తలు ఈ రకాన్ని తమ పర్యవేక్షణలో సాగు చేస్తూ దిగుబడులు పరిశీలిస్తూ వస్తున్నారు. ఆ తర్వాత 2023 నుంచి తమ భూముల్లో విత్తేవిధంగా శాస్త్రవేత్తలు రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో పల్నాడు జిల్లాలో సైతం గత ఖరీఫ్‌లో మండలానికి పది మంది రైతులకు ఉచితంగా విత్తనాలిచ్చి పురుగు మందులు కూడా ఇచ్చిసాగుచేయాలని డాక్టర్ సాంబశివరావు తదితరులు ప్రోత్సహించారు. నీటి పారుదల ఉన్న చోట పంట వేసిన వారికి అంతకు ముందున్న ఫేమస్ వెరైటీల కన్నా అధిక దిగుబడులు రావడం క్షేత్రస్థాయిలో గుర్తించడం జరిగింది.



చర్లగుడిపాడులో సాగులో ఉన్న కంది పైరు

తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడినిస్తుంది



ఈ రకం ఎండు తెగులును పూర్తిగా తట్టుకుంటుంది. వెర్రి తెగులును పాక్షికంగా తట్టుకుంటుంది. ఖరీఫ్, రబీ రెండు కాలాల్లో దీనిని సాగు చేయవచ్చు. ఖరీఫ్‌లో అయితే జూన్, జూలైలో రబీలో అక్టోబరులో వేసుకోవచ్చు. ఖరీఫ్‌లో అయితే పెద్ద అచ్చు పెట్టుకోవాలి. రబీలో పత్తి సాగు అచ్చు పెట్టుకోవచ్చు. కాయలు జడలుగా గుత్తులుగా కాస్తాయి. గింజ నాణ్యత బాగుంటుంది. ఆకులు కాయలు ఒకే రంగులో ఉండి కాపు పైకి పెద్దగా కన్పించదు. అయినా దిగుబడి మాత్రం నీటి పారుదల ఉంటే ఎకరాకు పది క్వింటాళ్ల పైనే వస్తుంది.

– డాక్టర్ ఎస్.రాజమణి, విత్తనం ప్రధాన రూపకర్త

సౌభాగ్య పంట మెరుగ్గా ఉంది

నేను నాలుగెకరాలలో సౌభాగ్య రకం కంది అక్టోబరులో వేశాను. కంది కోసి కల్లం చేస్తున్నాను. పది క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా. ఏడున్నర ఎకరాల చేలో సౌభాగ్య విత్తనంతో పాటు మరో టాప్ కంపెనీ విత్తనం కూడా వేశాను. సౌభాగ్య పంటే మెరుగ్గా ఉంది. మంచి దిగుబడి కూడా వస్తుందని ఆశిస్తున్నా. రబీలో వేసినా ఎత్తు బాగా పెరుగుతోందని తలలు కట్ చేయించా. ఒకసారి బెట్టకు వచ్చిన తర్వాత నీరు పెట్టడంలో జాప్యం జరిగి పూత రాలి పోయినా తర్వాత మళ్లీ పూత వచ్చి కాసింది. రైతులు వేసుకోదగిన విత్తనం.

– శిరసనగండ్ల శ్రీనివాసాచారి, రైతు, చర్లగుడిపాడు, గురజాల మండలం

గరిష్ఠ దిగుబడులు సాధించే అవకాశం..

నేను 20 సెంట్ల విస్తీర్ణంలో నిమ్మచెట్ల మధ్య అంతరపంటగా శాస్త్రవేత్తలిచ్చిన సౌభాగ్య విత్తనం కంది వేశాను. కంది కోసి కళ్లం కూడా చేయించా. ఆరు టిక్కీలయ్యాయి. అమ్మితే 3.48 క్వింటాళ్ల తూకం వచ్చింది. అంటే ఎకరాకు 17.40 క్వింటాళ్ల చొప్పున గరిష్ఠ దిగుబడి వచ్చింది. ఇది వేయదగిన విత్తనమే. సరిగ్గా యాజమాన్యం చేస్తే గరిష్ఠ దిగుబడి సాధించేందుకు అవకాశం ఉన్న రకం ఇది.

– డి.శ్రీనివాసరావు, రైతు, కారెంపూడి

నంద్యాల, సూర్యాపేట ఎడ్లకు ప్రథమ బహుమతి

తెనాలి రూరల్: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహిస్తున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన, పశు ప్రదర్శన పోటీలు ముగిశాయి. గత నెల 29వ తేదీ నుంచి జరుగుతున్న పోటీల్లో చివరి రోజైన శుక్రవారం సీనియర్స్ విభాగం పోటీలు నిర్వహించారు. 11 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. రాత్రి పొద్దు పోయే వరకు హోరాహోరీగా పోటీలు జరిగాయి. నంద్యాల జిల్లా పెదకొట్టలకు చెందిన జోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణ సూర్యాపేటకు చెందిన ఏఎస్పీ సుంకి సురేందర్‌రెడ్డి కంబైన్డ్ ఎడ్ల జత నిర్ణీత సమయంలో 3619.9 అడుగులు లాగి ప్రథమ బహుమతిని పొందాయి.తాడేపల్లికి చెందిన లంకిరెడ్డి నిక్షేత్‌రెడ్డి ఎడ్ల జత(3394.10 అడుగులు) రెండో బహుమతిని, ప్రత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత (3351.8 అడుగులు) మూడో బహుమతిని సాధించాయి. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిగా బుల్లెట్ బండిని అందజేశారు. పోటీలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు పీఎస్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ ఖాన్

వినుకొండ: వక్ఫ్ సవరణ బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు పీఎస్ ఖాన్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుకు సంబంధించి ఆల్ ఇండియా ముస్లిం లా బోర్డు, జమైత్ – ఉల్ – ఉలేమా, జమైత్ ఇస్లాం–ఎ–హింద్ సహా పలు మైనార్టీ సంస్థలు అనేక అభ్యంతరాలను వ్యక్తం చేశాయన్నారు. దేశంలో 14.6 శాతం ఉన్న ముస్లింల అభ్యంతరాలను కేంద్రప్రభుత్వం పట్టించుకోకుండా ఆర్టికల్ 14, 25, 26లను ఉల్లంఘిస్తుందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పర్యవేక్షణ కలెక్టర్లకు అప్పగించడం, వక్ఫ్‌బోర్డులో అన్యమత సభ్యులను నియమించడం, వక్ఫ్ ఆస్తులు 12 ఏళ్లగా ఎవరి అధీనంలో ఉంటే వారివే అనడం, 300 ఏళ్ల క్రితం నాటి ఆస్తులకు ఇప్పుడు డాక్యుమెంట్‌లు అడగడం భూములను వితరణ చేయాలనడం.. ఇవన్నీ ముస్లింల మనోభావాలను దెబ్బతీసే వ్యతిరేక చర్యలు అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ ఈ బిల్లును వ్యతిరేకించిందని గుర్తు చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన చంద్రబాబు ఒక ముస్లిం ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. కౌన్సిలర్లు గౌస్‌బాషా, షేక్ రఫీ, మైనార్టీ నాయకులు హఫీజ్, గౌస్‌బాషా, హిఫ్జీ, జానీ, అయాజ్, అమీర్, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.



నాదెండ్లలో పొలంలో తడిసిన పొగాకు పంట



చిలకలూరిపేటలో కురుస్తున్న భారీ వర్షం

అకాల వర్షం.. రైతుకు కష్టం



గణపవరంలో మిర్చి కల్లాలపై పట్టలు కప్పుతున్న రైతు



పిడుగుపడి తగలబడుతున్న తాడిచెట్టు

నాదెండ్ల: అకాల వర్షం రైతుల్ని ఉరుకులు పరుగులు పెట్టించింది. శనివారం మధ్యాహ్నం సమయంలో నాదెండ్ల, గణపవరం, తూబాడు తదితర ప్రాంతాల్లో సుమారు అర్ధగంట సేపు వాన కురిసింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చిని రైతులు పట్టలు కప్పుకుని కాపాడుకున్నారు. పొగాకు ఆకులను రైతులు కట్టి పొలాల్లోనే ఆరబెట్టుకోగా వర్షానికి తడిచాయి. దీంతో నాణ్యత లోపిస్తుందని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు మాత్రమే కుట్టిన ఆకులై పట్టలు కప్పుకున్నారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో కోతకు వచ్చిన మిర్చి తడిచింది. మార్కెట్లో మిర్చి పొగాకు ధరలు పతనం కావడంతో ఈ అకాల వర్షం మరింత నష్టపరుస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

చిలకలూరిపేట టౌన్: చిలకలూరిపేటలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అప్పటివరకు ఎండగా ఉండగా, ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని, కొద్ది సేపట్లోనే చల్లని గాలులు వీస్తూ మోస్తరు వర్షం మొదలైంది. తర్వాత అది భారీవర్షంగా మారి గంటకు పైగా ఎడతెరిపి లేకుండా కురిసింది. వర్షపు నీటితో పట్టణంలోని పలుచోట్ల కాలువలు నిండి మురుగునీరు రోడ్లపైకి చేరింది. ముఖ్యంగా ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డు నుంచి హైవే పైకి కొంత నీరు చేరి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

గొట్టిపాడులో పిడుగుపాటు..

మండల పరిధిలోని గొట్టిపాడు గ్రామంలో వర్షం మధ్య పిడుగుపాటు కలకలం రేపింది. గ్రామంలో ఉన్న తాటిచెట్టు పై ఒక్కసారిగా పిడుగు పడింది. క్షణాల్లో మంటలు చెలరేగి తాడిచెట్టుతో పాటు చుట్టు ఉన్న చెట్లు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

సమతావాది బాబూ జగ్జీవన్ రామ్

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మాచర్ల పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి వచ్చిన ఎస్సీ, గిరిజన సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పీఆర్కే జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమతావాది బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు ఎనలేనివన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన పాటు పడ్డారన్నారు. ఆయన అడుగుజాడల్లో వైఎస్సార్ సీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి కృషి చేసిందన్నారు. జగ్జీవన్‌రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాచర్ల ఎంపీపీ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాచర్ల సుందరరావు, బి.మరియమ్మ, కౌన్సిలర్లు సంతోష్, అల్లి జీవన్, ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, ఎస్సీ విభాగం రాష్ట్ర సభ్యుడు వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అలరిస్తూ.. ఆలోచింపజేస్తూ..

కొనసాగుతున్న సుందరయ్య కళానిలయం జాతీయస్థాయి నాటికల పోటీలు



జనరల్ బోగీలు నాటికలోని ఓ సన్నివేశం



నాటికలు చూసేందుకు వచ్చిన కళాభిమానులు

యడ్లపాడు: పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు రెండోరోజైన శనివారం కొనసాగాయి. రెండు రోజులు జరిగిన ఆరు ప్రదర్శనలు బంధాలు, వాటి విలువలు, సంప్రదాయాలు, సంస్కృతి గురించి వివరించాయి. నాటికలోని ప్రతి సంఘటన సమాజాన్ని సూటిగా ప్రశ్నిస్తూ ఆలోచనలను రేకిస్తుంది. ఈ కళారూపాల్ని తిలకించేందుకు కళాభిమానులు అధిక సంఖ్యలో తరలి రావడం, అర్ధరాత్రి వరకు అన్ని ప్రదర్శనల్ని ఎంతో ఆసక్తిగా తిలకించడం విశేషం.

మానవ సంబంధాల్లో శూన్యతను ప్రశ్నించే 'నా శత్రువు'..

ఆధునిక జీవనశైలిలో టెక్నాలజీ ఆధిపత్యాన్ని కేంద్రంగా తీసుకుని, మానవ సంబంధాల్లో ఎదురవుతున్న శూన్యతను బహిర్గతం చేస్తున్న ఇతివృత్తం 'నా శత్రువు' నాటిక. సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, సోషల్ మీడియా వంటివి సమయాన్ని మింగేస్తూ, మనుషుల మధ్య దూరాన్ని పెంచుతున్నాయని ఈ నాటిక స్పష్టంగా చూపిస్తుంది. కుటుంబ సంబంధాలు, అనుబంధాల విలువ తగ్గిపోతున్న నేపథ్యంలో, ఈ నాటిక ఒక హెచ్చరికగా నిలుస్తుంది. జయభేరీ థియేటర్స్ హైదరాబాద్ వారు సమర్పించిన ఈ నాటికను అక్కల తామేశ్వరయ్య రచించగా వడ్డాది సత్యనారాయణ దర్శకత్వం వహించారు.

- అదేవిధంగా ఆధునిక ఆడపిల్లల స్వతంత్ర భావనలు వివరిస్తూ.. ఆడపిల్లలు భారం అన్నట్టుగా నమ్మే వక్ర భావజాలాన్ని సూటిగా విమర్శించిన 'రుతువు లేని కాలం', ఓ సామాన్య మహిళ రైల్వే శాఖపై సంధించిన అస్త్రంగా సాగిన 'జనరల్ బోగీలు' నాటికలు ఆలోచింపజేశాయి.

సేవా దృక్పథం అలవరచుకోవాలి



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు మానం సుబ్బారావు

అమరావతి: విశ్రాంత ఉద్యోగులు సేవాదృక్పథం అలవరచుకోవాలని పల్నాడు జిల్లా పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు మానం సుబ్బారావు అన్నారు. శనివారం అమరావతి యోగాశ్రమంలో నిర్వహించిన అమరావతి, పెదకూరపాడు మండలాల యూనిట్ ప్రభుత్వ పెన్షనర్ల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈసమావేశానికి స్థానిక పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగంలో ఉన్నంతకాలం సర్వీసు చేయటమే కాకుండా రిటైర్ అయిన తరువాత కూడా సమాజం పట్ల బాధ్యతతో మెలగాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సి.ఆదెయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అదనపు క్వాంటుకు పెన్షన్‌ను పెంపుదల చేయాలన్నారు. సైబరు నేరాలు, మోసాలు పెరిగిపోతున్న నేటి రోజుల్లో పెన్షనర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా కోశాధికారి ఎంఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. వెంటనే పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండు చేశారు. ప్రధానకార్యదర్శి కె.సిహెచ్. తిమ్మయ్య, వై.సుబ్బారావు మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎన్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రికెట్ పోటీల్లో సత్తెనపల్లి పోలీసుల సత్తా



సబ్ డివిజన్ పోలీస్ జట్టుకు కప్పు అందిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ్‌కుమార్ రెడ్డి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి సబ్ డివిజన్ స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో సబ్ డివిజన్ పోలీసులు సత్తా చాటారు. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో న్యాయవాదులకు, సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు(సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లు) ఆదివారం ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు జరిగాయి. సీనియర్ సివిల్ జడ్జి పి.వి జయ్‌కుమార్‌రెడ్డి టాస్ వేయగా టాస్ గెలిచిన న్యాయవాదులు ఫీల్డింగ్ ఎంచుకున్నారు. ఈ పోటీల్లో పోలీసు జట్టు 16 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన న్యాయవాదుల జట్టు 69 పరుగులకే ఆల్ అవుట్ అయింది. 50 పరుగులు తేడాతో సత్తెనపల్లి సబ్ డివిజన్ పోలీసులు గెలుపొందారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను వేలిముద్రల విభాగం ఇన్‌స్పెక్టర్ రహీమ్ కైవసం చేసుకున్నారు. పోలీసుల జట్టుకు పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య కెప్టెన్‌గా వ్యవహరించగా న్యాయవాదుల జట్టుకు న్యాయవాది పొత్తూరి హరి మణికంఠ కెప్టెన్‌గా వ్యవహరించారు. విజేతలకు సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ్ కుమార్ రెడ్డి కప్పు అందించి అభినందించారు. ఆయనతోపాటు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ మహమ్మద్ గౌస్ ఉన్నారు. క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటిన సబ్ డివిజన్ పోలీస్ జట్టును సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు ప్రత్యేకంగా అభినందించారు. కాగా తొలుత పోటీలను సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం రెండు జట్లను పరిచయం చేసుకొని కరచాలనం చేశారు. బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, పవన్ కుమార్, పాల్ రవీంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు చిన్నం.మణిబాబు, న్యాయవాదులు, సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు, తదితరులు ఉన్నారు.

గీతామందిరం ఎదుట వైన్‌షాపు ఏర్పాట్లు దుర్మార్గం

- ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీయొద్దు
- వాసవీ క్లబ్ వైస్ గవర్నర్ ఆత్మకూరి హరేరామ చెంచయ్య



మాట్లాడుతున్న హరేరామ చెంచయ్య. పక్కన ఆర్యవైశ్య నాయకులు

సత్తెనపల్లి: పట్టణంలోని గార్లపాడు సెంటర్‌లో గల గీతామందిరం ఎదురు వైన్‌షాపు పెట్టాలనుకోవడం దుర్మార్గమని వాసవీ క్లబ్ వైస్ గవర్నర్, ఆర్యవైశ్య సంఘ పట్టణ మాజీ అధ్యక్షుడు ఆత్మకూరి హరేరామ చెంచయ్య అన్నారు. పట్టణంలోని కట్టమూరివారి వీధిలోని ఆర్యవైశ్యులు శనివారం గీతా మందిర్ దేవాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరేరామ చెంచయ్య మాట్లాడుతూ పట్టణంలోని పాత గ్రంథాలయం పక్కనే ఎప్పటి నుంచో గీతా మందిరం దేవాలయం ఉందని దానికి ఎదురుగా నూతన మద్యం దుకాణం ఏర్పాటుకి పనులు చేస్తున్నారన్నారు. అక్కడ మద్యందుకాణం ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతీయొద్దన్నారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఆర్డీఓ, ఎక్సైజ్ సీఐ, తహసీల్దార్‌లకు మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వరాదంటూ వినతి పత్రం ఇచ్చామన్నారు. వైన్‌షాపు ఏర్పాటును మానుకోవాలని హితవు పలికారు. ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు అన్నం సుబ్రహ్మణ్యం, నాయకులు శ్రీను, రాధ కృష్ణ, గోపాల్, రాము, ఆర్‌కె, మహిళలు ఉన్నారు.

కూటమి కాదిది.. కుట్రల ప్రభుత్వం

మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్ భార్య సురేఖ



మాచర్ల రూరల్: ఇది కూటమి ప్రభుత్వం కాదని.. కక్షల, కుట్రల ప్రభుత్వమని సెలవులో ఉన్న మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ సతీమణి తురక సురేఖ ఆరోపించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన భర్త తురక కిషోర్‌ను ఒక కేసులో ఇరికించి నిందితుడిగా అదుపులోకి తీసుకొని బెయిల్ పై బయటకు వచ్చే సమయంలో అనేక కేసులు బనాయిస్తూ 90 రోజులకు పైగా రిమాండ్ ఖైదీగా ఉంచటం పై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్‌గా పనిచేస్తున్న రాజకీయ నాయకుడిపై పీడీ యాక్టు ఎలా నమోదు చేస్తారని ఆమె ప్రశ్నించారు. బెయిల్‌పై బయటకు వస్తాడేమోనని కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతూ కక్ష పూరిత ధోరణితో అనేక కేసులు పెట్టిందని, నాగార్జున సాగర్ కేసులో అక్రమంగా ఇరికించి తమ కుటుంబాన్ని ఇబ్బందుల పాలు చేస్తున్నారని వాపోయారు. కూటమి నేతలు తన భర్త కిషోర్‌తో పాటు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న, జర్నలిస్టుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన ఇరువురు సోదరులపై కూడా అక్రమంగా కేసులు పెట్టారన్నారు. మూడు సంవత్సరాల చిన్నారి, ఆరు నెలల పాపతో తాను భర్త కోసం నెల్లూరు, గుంటూరు, రాజమండ్రి జైళ్ల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అర్ధరాత్రిళ్లు ఇంటిపై దాడులు చేస్తున్నారు..

కుటుంబం చిన్నాభిన్నమైన పరిస్థితిలో వేరే చోట తలదాచుకుంటుంటే ఆ ఇంటిపై కూడా అర్ధరాత్రి గడ్డపారతో కిటికీలు ధ్వంసం చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. రాజకీయంగా రాగద్వేషాలుంటే అంతవరకే చూసుకోవాలని, తమ కుటుంబంపై దాడులు చేస్తూ, కేసులు నమోదు చేస్తూ కూటమి ప్రభుత్వం తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నకరికల్లు: రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని చల్లగుండ్ల సమీపంలో అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గురజాల మండలం గోగులపాడు గ్రామానికి చెందిన గోవిందరాజు(40) రోడ్డుపక్కన తన ద్విచక్ర వాహనాన్ని పెట్టి రోడ్డు దాటేందుకు నడిచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పిడుగురాళ్ల వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాల పాలయ్యాడు. 108లో నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి..

చిలకలూరిపేట టౌన్: విద్యుత్ షాక్‌కు వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన బాణావత్ భీమానాయక్ (52) గడియారస్తంభం సెంటర్‌లోని పలు షాపుల్లో వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంటాడు. అబ్దుల్లా షాపులో పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

■ BPT, B.Sc (MLT) సీట్లు: విజయవాడలోని ప్రముఖ కాలేజీలో 2024–25 సం.కి BPT, B.Sc (MLT) మేనేజ్‌మెంట్ సీట్లు కలవు. సంప్ర: Principal, 8008280062.

COACHING

■ స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ ట్రైనింగ్ నేర్పబడును. ప్రభుత్వఉద్యోగులకు,లాయర్లకు డ్రాఫ్టింగ్ చెప్పబడును సమ్మర్‌లో 1st to 10th అన్ని సబ్జెక్టులకు ట్యూషన్ చెప్పబడును. మంగళగిరి, గుంటూరు. 8639024439

■ AP EAPCET 2025 BiPC విద్యార్థులకు షార్ట్‌టర్మ్ కోచింగ్ మరియు స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ బేసిక్స్ అత్యుత్తమ విద్యాబోధన. కృష్ణ ఫిజియోథెరపి కాలేజ్, గుంటూరు. 8977779908, 6300004967

REAL ESTATE

■ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, రాజా మరెక్కడైనా ప్లాట్స్ అ/కొ సంప్ర: జనచైతన్య మా ప్రత్యేకత. 7382396677

■ అమరావతి IJM రైస్ ట్రీ పార్క్, నంబూరు కొప్పురావూరు, కంతేరు, పరిసర ప్రాంతాలలో ఉడా అప్రూవల్ ప్లాట్స్ కావసినవారు సంప్ర. M.V.చౌదరి. 9885163444

■ బాపట్ల జిల్లా, అమృతలూరు గ్రామంలో మంచి లొకాలిటీలో 215 గజాల ఇంటి స్థలం & రోడ్డుకు సమీపంలో 5 ఎకరాల పొలం అమ్మకానికి కలదు. సంప్ర: 7893841849

■ శ్రీ కృష్ణ బృందావనం! ఫార్మ్ హౌస్ ల్యాండ్ గుంటూర్ (కొండవీడు) 25 కి.మీ పర్యటక ప్రాంతం సమీపంలో@ సెంటు లక్ష రూపాయలు. (10,14) సెంట్లు ప్లాట్స్ కలవు 9381449563

FLAT FOR SALE

■ గుంటూరు, విద్యానగర్, Opp: లిటిల్ ఫ్లవర్ స్కూల్, మయూర్ క్రిస్టల్ డ్యూ అపార్ట్‌మెంట్ నందు 3BHK ఫ్లాట్ అమ్మబడును. సెల్: 9491969482.

■ 3 BHK New flat for sale in Vijayapuri colony,JKC road, Guntur 1983 sft, 4800 per sqft. Fully furnished east facing.Ph: 7207262107

HOUSE FOR SALE

■ గుంటూరు అరండల్‌పేట 9వలైను 4–5 అడ్డ రోడ్ల మధ్య దక్షిణం ఫేసింగ్, 119 గజాల డాబా ఇల్లు అమ్మకమునకు కలదు. సంప్రదించండి. 9848977303

PLOT FOR SALE

■ గుంటూరు బస్టాండ్ కి 6 కి.మీ. బుడంపాడు రోడ్ కి, ఐక్యకి అతి దగ్గర్లో 30 అ. తారురోడ్డులో వెంచర్ నందు ప్లాట్లు చ. గజం రూ. 8500/- మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. 83175 28192

■ అమరావతిలో సత్తెనపల్లి రోడ్ సెంటు 4 లక్షలు రోడ్ ఫేసింగ్ & గుంటూరు రోడ్ అర ఎకరా పొలం సెంటు 4 లక్షలు విజయవాడ రోడ్ 4 ఎకరాల పొలం ఎకరా 2 కోట్లు. ఫోన్ : 95021 27182

TOLET

■ గుంటూరు, 4/2 అరండల్‌పేటలో శ్రీనివాస టీస్టాల్ పైన 1st ఫ్లోర్ 1300sft లాబ్స్ /ఆఫీస్‌లకు/కోచింగ్ సెంటర్ లకు అద్దెకు ఇవ్వబడును. ph. 9848977303

TO-LET COMMERCIAL

■ గుంటూరు నల్లపాడు రోడ్, సీతారామ టౌన్ షిప్ దగ్గర, లక్ష్మీనారాయణ వేబ్రిడ్జి ప్రక్కన సుమారు 5700 అ॥లు గల గోడౌను అద్దెకు/లీజుకు ఇవ్వబడును 9440264527

■ గుంటూరు గుజ్జనగుండ్ల కరెంట్ ఆఫీసు సమీపంలో మెయిన్‌రోడ్డు అనుకొని 2వవిట్ 400చ॥గ॥ గోడం అద్దెకు కలదు. (కరెంట్, బోర్ కలదు). సంప్ర: 9347166699

RENT

■ గుంటూరు, నల్లపాడు హౌసింగ్ బోర్డు కాలనీ, HIG No.61, Opp.నల్లగుంట 90Ft Road, East Facingతో, బ్యాంకులకు, ఆఫీసులకు, Software, Hardware,Schools, Collegeలకు అనువుగా ఉన్న 4 అంతస్థుల కమర్షియల్ (Each Floor 2240Sft) బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును. Lift, Car Parking కలదు. 89851 85685, 86394 28705.

SERVICES

■ సజ్జావారిపాలెం (నగరం (మం), బాపట్ల జిల్లా)లో భారత్ పెట్రోల్‌బంక్‌ను అనుకొని ఉన్న 100 టన్నుల ఫైకిసాన్ వేబ్రిడ్జ్ ఆటోల నుండి 18 టైర్ల లారీల వరకు తేలికగా మరియు కచ్చితంగా తూకం (కాటా) సరసమైన ధరలకు అందించగలదు. 24 గంటలు 365 రోజులు సేవలు పొందగలరు. 92461 64672

■ గుంటూరు నందు మహిళలకు, అనాథలకు, వృద్ధులకు, వికలాంగులకు వసతి కలదు. మహిళా మండలి సంస్థలకు గ్రైస్స్ కలదు. ఫిజియోథెరపి ట్రీట్మెంట్ కలదు. 8977365999, 8712100333

BOREWELLS

■ విజయ బోర్‌వెల్స్: 4-1/2; 6-1/2; 7" & 8" అంగుళం బోర్లు & క్లీనింగ్ సరసమైన ధరలకు వేయబడును. గుంటూరు. సంప్ర: 9866222717, 9848183887

RESTAURANT LEASE

■ గుంటూరు సిటీలో ప్రసిద్ధి గాంచి మంచి రన్నింగ్ కండిషన్‌లో గల రెస్టారెంట్ లీజుకు కలదు. సంప్ర : 9440807781

OLD BUILDING

■ పాత బిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకుల షెడ్‌లు పగలగొట్టబడును. పాత కలప, కిటికీలు, పాత ఐరన్ కొనబడును. సంప్ర: 9703290782, 9700442419

PEST CONTROL

■ చెదపురుగులు, బొద్దింకల నివారణ 5సం॥ గ్యారంటీ AN ISO 9001-2015 సర్టిఫైడ్ కంపెనీ లాస్సర్ పెస్ట్ కంట్రోల్ పట్నంబజార్, గుంటూరు. 8978672824, 9848131213

WANTED

■ తెనాలిలోని శ్రీమ డిజిటల్స్ నందు పని చేయుటకు తెలుగు టైపింగ్ & ఫొటోషాప్‌లో అనుభవం గల యువతీ, యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. 9393849494, 9959595927

■ శారదా హైస్కూల్ (Estd.1984) పర్చూరు బాపట్ల జిల్లాలో పనిచేయుటకు ఇంగ్లీష్, IIT మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్ బోధించుటకు అర్హత అనుభవం గల ఉపాధ్యాయులు కావలెను. 94914 77266, 94400 06429.

■ గుంటూరు Alavala Motors Vespa Show roomలో పనిచేయుటకు ఫీల్డ్ మేనేజర్-1, CRM-2, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్-4, సర్వీస్ అడ్వైజర్-1, మెకానిక్స్-2 కావలెను 9154976557

■ Wanted Spoken English and soft skill trainer (Male / Female). Timing : 9AM - 5PM. Sal: 15000. Location - Guntur 8317649459

■ Wanted Mother Teachers / Helping Teachers/Care Teachers/Parttime Teachers (Attractive Salary) Tiny Tots School, Inner ring road, Reddypalem 8332834129

■ చెన్నై తలప్పకట్టి ఫ్యామిలీ రెస్టారెంట్ నందు పనిచేయుటకు మీల్స్ మాస్టర్, స్టీవార్డ్, కెప్టెన్, టెలికాలర్స్ M/F కావలెను. వసతి కలదు. బ్రాడీపేట,గుంటూరు. 8386666093, 9392575755

■ ప్రముఖసంస్థ నందు వంట చేయుటకు, ఆఫీస్ వర్క్ కొరకు మరియు హెల్పర్లు కావలెను. 19 నుండి 35 సం॥లోపు స్త్రీలు కావలెను. భోజన & వసతి కల్పించబడును 9642807739

■ గుంటూరు సిటీ, మంగళగిరి రోడ్ లోని ప్రముఖ ఎక్స్‌పోర్ట్ కంపెనీ వారి గుంటూరు మరియు ఒంగోలు పరిసర ప్రాంతాలలోని బ్రాంచెస్ నందు పనిచేయుటకు కనీసం Inter అర్హత కలిగి MS ఆఫీస్‌లో నాలెడ్జ్ ఉన్న కంప్యూటర్ ఆపరేటర్స్ వెంటనే కావలెను. అర్హత, అనుభవమును బట్టి మంచిజీతం ఇవ్వబడును. ఆసక్తి గల అభ్యర్థులు మీ పూర్తి బయోడేటాను 15 రోజులలో psshr.recruit@gmail.com/ pssundar@polisetty.com మెయిల్స్‌కు పంపగలరు.

■ Wanted B-pharmacy or D-pharmacy candidates to work in a pharmacy in guntur city. Pci registration mandatory and wanted packing & delivery boys.Q:10th 6300975241

■ Wanted Female Accountants (B-com or M-com) Having work experience in audit offices, proficient in Tally Prime, GST & Income tax Filing to work in guntur city. 6300975241.

■ తెనాలిలోని ప్రముఖ జ్యోతి ఫర్నిచర్ మాల్ నందు పనిచేయుటకు వర్కర్స్ (జంట్స్) స్టాఫ్ కావలెను. జీ. 8000 - 12000/- లోకల్ వారికి ప్రాధాన్యత. 6281252588

■ కంప్యూటర్ ఫ్యాకల్టీస్ ఫర్ DCA, DTP, టాలీ, C, జావా, పైథాన్, ఇంగ్లీష్ ట్రైనర్స్, టీటీ ట్యూటర్స్, హిందీ, మ్యాథ్స్, సోషల్, సైన్స్ టీచర్స్ & రెసెప్షనిస్ట్ కావలెను. మంగళగిరి, గుంటూరు. 86390 24439

■ Wanted Trained Graduate with B.Ed or D.Ed to Teach CBSE Curriculum Class: Nursery to 10th EM Telugu-1, Hindi-1, English-1, Mathematics-1, GS-1, SS-1, PET-1, Drawing-1, Nursery-2nd Class - Mother Teachers to Teach All Subjects-5 Nos and Pro's-3, Salary 7k to 20k. Cont: Sparks EM School, Damarapalli, Guntur, Contact: 9912528244, 8142676274

■ గుంటూరు బృందావన్‌గార్డెన్స్, NTR కాంప్లెక్స్ లో గల సిరి స్వీట్స్ షాపు నందు పనిచేయుటకు సేల్స్ గార్ల్స్ కావలెను. 10th, P/F జీ: 18- 20వేలు. టైం: 9am-8pm & 3pm-10pm. 9847166699

■ గుంటూరు కాలేజీలోని చిన్న క్యాంటీన్ నందు సుమారు 50మందికి టీ, టిఫిన్ 8AM-6PM వరకు చేయుటకు అనుభవం గల సీనియర్ లేడీస్ కావలెను. 8977365999, 8712100333

■ ప్రముఖ స్టార్ హోటల్ గీతారీజెన్సీ నందు పనిచేయుటకు రెస్టారెంట్ వెయిటర్స్ & బాయ్స్ (వెజ్ మరియు నాన్ వెజ్), రూమ్ సర్వీస్ వెయిటర్స్, చైనీస్ మాస్టర్స్, పూరి & రైస్ మాస్టర్స్ ఆల్ రౌండర్స్, మెయింటెనెన్స్ బాయ్స్, హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్స్, వాష్ పాంట్రీ మరియు కిచెన్ అసిస్టెంట్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర: 4/1, అరండల్‌పేట, గుంటూరు. 99490 77525

■ ఉచితంగా కంప్యూటర్ MS Office, Spoken English, Computer హార్డ్‌వేర్ కోర్సులలో 3 నెలలో శిక్షణ ఇచ్చి 100% ఉపాధి చూపించబడును. ఫ్రీ భోజనం, హాస్టల్. Qul: 10th, Inter, Degree, ITI and above, గుంటూరు. 9133444986 / 88 / 89

■ ఉచితంగా Solar Technician, MS-Office, Spoken English కోర్సులలో 3 నెల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపించబడును. ఉచిత భోజన & హాస్టల్ వసతి. Q:10th, Inter, B.Tech and above (Pass/Fail) Age: 18-27సం॥ Add : గుంటూరు 9177133358, 9133444989

■ Wanted Girls Aged 18-24 years to work as Sales Girls in a Jewellery Showroom Fruitmarket, Lalapet, Guntur. Cont: 9700311201

■ ప్రముఖ కూల్‌డ్రింక్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు యువతి, యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15,000/-+3వేలు వెంటనే సంప్రదించండి. 9121469383

■ Sri Saradha Niketan Public School Martur Bapatla Dist. Wanted Jobs Maths, Physics, Chemistry Qly M.Sc B.Ed (Exp 5 to 10 Yrs) With JEE. Mains, Neet, English-01, B.A (or) M.A CEB-01 (M.Com or M.B.A) Computer Operator-02 (Any Computer Certificate) Ph. 70957 23036, 93988 32060

■ త్రినేత్ర హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను.ఉచిత వసతి భోజనం. జీతం:18K.Ph:8520980099, 8520874499

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ఈ సెల్ఫోన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక